# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం ఈరోజు జరుగుతుంది.**

2. **సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఎటువంటి చర్యలు తెలంగాణ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లోని కొండవీడు కోటను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో రేషన్ కార్డుదారులందరికీ 20 రూపాయలకే కిలో గోధుమపిండిని పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" 9 వ సంచిక కార్యక్రమంలోని రెండవ భాగం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి విద్యార్థులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానెల్, ఆకాశవాణి, దూరదర్శన్ లతో పాటు విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాలలోనూ ప్రసారం అవుతుంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం ఈరోజు జరుగుతుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొననున్నారు. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు దృశ్య మాధ్యమ విధానంలో ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి-జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన ప్రణాళికల అమలు వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆయా శాఖలు తీసుకోవాల్సిన కార్యాచరణ, చేరుకోవాల్సిన లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు దిశానిర్దేశం చేయనున్నారు.

---------------------------

సింగరేణి కార్మికులకు నష్టం  కలిగించే విధంగా ఎటువంటి చర్యలు  తెలంగాణ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పురపాలక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లాలో నిన్న పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ  శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్మించిన నూతన వసతి గృహ భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం  ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర అని అన్నారు. సింగరేణి  భూపాలపల్లి జిల్లాను ప్రభుత్వం రద్దు చేస్తుందని అసత్య ప్రచారం చేస్తున్నారని జిల్లాలను రద్దు చేసే ఆలోచన  లేదని స్పష్టం చేశారు. ప్రజలతో చర్చించిన తర్వాతే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

చారిత్రక ప్రాధాన్యం కలిగిన కొండవీడు కోటను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాలోని కొండవీడు కోట వద్ద నిర్వహించిన "కొండవీడు ఉత్సవాల"ను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు ఈ సందర్భంగా కేంద్రమంత్రి  మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి-ఏపీఎంసీ ఎన్నికలు ఈ రోజు  జరగనున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు  ఆన్‌లైన్‌లో పోలింగ్ నిర్వహిస్తారు. 13 మంది అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉండగా.. ఆయా స్థానాలకు 84 మంది పోటీలో ఉన్నారు. మండలిలోని అర్హులైన 56 వేల 374 మంది వైద్యులు తొలిసారి ఆన్‌లైన్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. రిజిస్టర్డ్ మొబైల్ లేదా ఈమెయిల్ ఐడీ ద్వారా పంపే ఓటీపీ, ఐపీ అడ్రస్ ద్వారా మాత్రమే ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. 20 ఏళ్ల  తర్వాత జరుగుతున్న  వైద్య మండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఓట్ల లెక్కింపును రేపు తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ సంచాలకుల కార్యాలయంలో నిర్వహించి.. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రేషన్ కార్డుదారులందరికీ 20 రూపాయలకే కిలో గోధుమపిండిని పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో లబ్ధిదారులకు గోధుమపిండిని మంత్రి నిన్న పంపిణీ చేశారు. 'ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో 1,800 టన్నుల గోధుమపిండిని పంపిణీ చేస్తున్నామని, రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పంపిణీ చేస్తామని  మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

దేశ భద్రత, తీర ప్రాంత రక్షణపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన వందేమాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 ఆంధ్రప్రదేశ్ లో కొనసాగుతోంది వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సి.ఐ.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన వందే మాతరం సైక్లోథాన్ కాకినాడ జిల్లా నుంచి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంకు చేరుకుంది. ఈ సందర్భంగా మంగినపూడి తాళ్లపాలెం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ గ్రూప్ కమాండెంట్, రోషన్ రాజా మాట్లాడుతూ, దేశ భద్రతకు సంబంధించి తీర ప్రాంతంలో ప్రజలను చైతన్య పరుస్తూ సైక్లోథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాయిస్ 31 సెకన్లు

---------------------------

తెలంగాణాలోని గ్రామాలతో పాటు పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా చెవేళ్లలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

ఈరోజుతో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈనెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత క్రమంగా తగ్గుతుండగా.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయవ్య ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, దీంతో తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు ఈ రోజు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలను మతపెద్దలు జ్యోతి వెలిగించి ప్రారంభించనున్నారు. అనంతరం ప్రారంభ పవిత్ర సమష్టి దివ్యపూజాబలి నిర్వహించనున్నారు. సాయంత్రం నగరవీధుల్లో మేరీ మాత స్వరూపాన్ని ఊరేగించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దులో నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాకు చెందిన నలుగురు మృతి చెందారు. కర్ణాటకలోని కోలార్ జిల్లా శ్రీనివాసపురం సమీపంలో వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా, వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, వాహనంలో ఉన్న మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

====================